VILLAGE PANCHAYAT LIBRARY
VADAMALAPETA P.O.
PUTTUR TALUK
CHITTOOR DT.
1318

# దావానలం

ప్రకాశరావు ఇలా చెప్పేడు.

నిజంగా ఆ పెళ్ళి కెళ్ళడం నాకేమాత్రం ఇష్టంలేదు. పిలవడానికే! పేరుపేరు వరసనా వాళ్ళందర్నీ పిలుస్తారు. ఒకవిధంగా అలా పిలవడంవల్ల లాభమేగాని నష్టమేమీ ఉండదు. వచ్చినప్రతివాడూ కాకపోయినా, చాలామంది ఏదోవొకటి చదివించాలి; చదివిస్తారు కూడాను. నాకేమనిపిస్తుందంటే ఇలాపిలవడం కేవలం చదివింపులకోసరమేనని. ఈమాటే నేను పొరబాటున మా ఆవిడతో అన్నాను. ఇలాంటి బ్రహ్మాండమైన ఆలోచన నాకొచ్చినందుకు ఆవిడ సంతోషించలేదు సరిగదా, నన్ను నాలుగూ పెట్టింది.

"అదిగాదండీ! మీకు రోజురోజుకూ ఇలా మతి పోతోందేమిటి? రూపాయలూ పైసల్లోతప్ప, మరోరకంగా మీరు దేన్నిగురించీ ఆలోచించరేం! ఏముంది; తానెంతో జగమంతా అలా అనుకొంటే ఎలా? ఏమోనబ్బా! మీరెవర్ని పిలిచినా, అలా అనుకొనే పిలుస్తారుగావును. మా ఉమ్మన్నాయకి ఇలాంటి లేకిబుద్ధులు లేవు..."

దానికేమి సమాధానం చెప్పవలసిందీ నాకు తెలుసు. తెలిసినా చెప్పలేదు. చెప్పినా అది వినిపించుకోదు. వినిపించుకొన్నా అర్థంకాదు. అథవా అయినా, అర్థమయినట్లు అది చస్తే వొప్పుకోదు. లలితవిషయం నాకు కొత్తయితే ఏమోగానీ, ఏణ్ణర్థంనుంచీ కాపరం వెలిగిస్తున్న తరువాతగూడా, నేనలా ప్రవర్తిస్తే నాకంటే మరోమూర్ఖుడుండడు. నిజా

నిజాలు, ధర్మాధర్మాలు విచారించడం నేను మానేసి చాలా కాలమైంది. మా ఆవిడముందు అలాంటివేమీ పనికిరావు. దురదృష్టవశాత్తు అది పెంకిదే గాకుండా, మహా పట్టుదల గూడా ఉన్నమనిషి. ఒకసారి ఓ విషయంలో దానితో ఏకీభ వించలేక పదిరోజులపాటు ఒంటరిగా వండుకోవలసిన కర్మ కొని తెచ్చుకొన్నాను.

ఇక లలితతో వాదించి లాభంలేదనుకొన్నాను. ప్రయా ణానికి కావలసిన ఏర్పాట్లన్నీ చెయ్యమన్నాను.

"ఆఁ. పెద్దగా ఏమీవొద్దులెండి. మాఉమ్మన్నాయనకు ఓ జత సిల్కుబట్టలు కొనండి. నూరు నూటపాతికలోవస్తే, ఓ గడియారంకూడా కొంటే బావుంటుందనుకొంటాను. పెళ్ళి కూతురుకు పట్టుచీరె, ముఖమల్ జాకెట్టు ఎటుగూడీ కొంటా రామె. వీలుంటే నాకోచీర పట్టుకురండి. చాలు. ఈడబ్బులేని రోజుల్లో, ఏదో మాయామంత్రంగా జరుపుకోకపోతే, అనక నానాబాధలూ పడవలసివస్తుంది. ఇప్పుడంటే ఇద్దరంగనక కనపట్టంలేదు. ఎల్లకాలం ఇద్దరమే ఉంటామా?" అన్నది మా ఆవిడ.

ఇంకావుంటే ఏమేమి చెబుతుందోనన్న భయంవల్ల చప్పున ముఖంతప్పించాను. చూస్తూచూస్తూ ఇంతడబ్బు ఖర్చుపెట్టటానికి ప్రాణం గిలగిలలాడుతుంది. ఒకవేపు డబ్బు జాగ్రత్తగావాడాలంటూనే, అనవసరమైన ఇన్ని ఖర్చులకు, అవసర కారణములుగా భ్రమించి మాట్లాడే మా ఆవిడ తెలి విని చూచి నేను విచారించాను. పోనీ దగ్గరసంబంధమైతే, నేనింతబాధపడకపోదును. మనవాళ్ళకే చెందాయన్న సంతృ

ప్తన్నా నాకు దక్కుతుంది. నేనెప్పుడూ వాణ్ణిచూడనుగూడా చూడలేదు. అథవా చూచానేమో నాకు గుర్తులేదు. (చూచానని మా ఆవి డన్నది.) అలాంటి 'నే చూడనివ్యక్తి' కోసం అథమపక్షం అయిదారొందలు ఖర్చుపెట్టటంకన్నా దండగమారి కార్యం మరొకటుండదు. అదీగాక మా ఆవిడ ఆ ఊరువెళ్ళాలని మహా ఆరాటపడుతుంది. నన్నే తీసుకెళ్ళ మని నాలుగైదుసార్లు అడిగింది. సెలవు దొరకదన్నాను. ఏకంగా మూడు నెలలు సెలవురావటము, ఉమ్మాయిగాడి పెళ్ళికూడా ఇప్పుడే తగులడ్డమూ నా ప్రాణంమీది కొచ్చింది.

ప్రయాణమవుతువున్న రోజున అది ప్రకటించిన ఉత్సాహం చూస్తే, ప్రయాణమే కాకపోతే ఎంతగొడవయి ఉండును అన్న భయమేర్పడ్డది!

## 2

సుఖంగా జేరుకొన్నాం. నే నెవరో తెలిసినతరువాత, ఉమాకాంతంతల్లి, నన్ను కూర్చోమనలేదు. ఒకరకంగా అది నామనస్సును బాధపెట్టింది. లలితనోటికి జడిసి నేను కిక్కురు మనలేదు...

లలితకూ నాకూ కలిపి ఓగది యిచ్చారు. మా సామా నంతా ఆ గదిలోకి సర్దుకొన్నాం.

'ఎందుకయినా మంచిది. ఆతాళంచెవి నాకివ్వండి,' అన్నది లలిత.

"అదేం ?"

'మీకు మరీ మతిమరుపు. ఎక్కడైనా పారేశారంటే-నానాబాధలూ పడాలి'

'నేను చిన్నపిల్లాణ్ణటే!'

'వాళ్ళేనయం మీకన్న! వాళ్ళకు నచ్చచెప్పవచ్చు. మీకు అదీపనికిరాదు. అయినా అలాపదిమందిలోనూ తిరిగే వాళ్ళకు, తాళంచెవి ఎందుకూ?"

'నేను తిరగను. తిరగలేను. ఆగదిలో పడుకుంటా.'

'ఇంత లేకిమనిషివేం' అన్నట్టు ఓచూపు చూసి, తాళంచెవి నాకిచ్చి వెళ్ళింది. గది బాగానే ఉంది. రెండో అంతస్తు గావటంతో గాలి ధారాళంగా వస్తుంది. మా రెండు పెట్టెలు అందులో పడేయించాను. ఓ పాతకాలపు మంచం, ఆట్టేవాడకంలేని బాప తొంకటుంది దాన్నికాస్త సంస్కరించి, పరుపు పరుచుకొని పడుకొన్నాను.

ఒకొక్కక్క మనిషిని చూస్తే ఆరాధించబుద్ధవుతుంది. ఒకొక్కర్ని చూస్తుంటే లాగితన్నాలనిపిస్తుంది. నిజంగా ఆ మొదటివ్యక్తి చేసిన ఉపకారమూ ఉండదు. ఆ రెండోవారు చేసిన అపకారమూ ఉండదు.అందరివిషయమూ నేను చెప్పటంలేదు. నా జీవితంలో ఇలాంటి అనుభవాలు చాలా వున్నాయి. అదేం గ్రహచారమోగానీ మా లలిత ముఖంచూస్తూ నేను నిజంచెప్పలేను. 'ఎందుకని?' అంటూ ఎవరన్నా ప్రశ్నిస్తే నేను సమాధానం చెప్పుకోలేను. అవును, కారణంలేకుండా ఏదీఉండదనీ, అలాఉండటానికి ఆస్కారం లేదనీ నాకు తెలుసు. ఐనా లలితపట్ల నేనిలా ప్రవర్తించటానికి తగుకారణం చెప్పుకోలేను. ఏదో ఉండేఉంటుంది.

నా వెధవబుర్ర కది స్ఫురించదు మరి. ఎందుకు చెబుతున్నా నంటే-నిజంగా నా కేసు స్త్రీలేదు. ప్రయాణపు బడలికగూడా లేదు. హాయిగా, ఉల్లాసంగా వున్నాను. ఎందుకో 'తిరగ లేను, తిరగను'అంటూ మా ఆవిడకు హామీయిచ్చాను. నేను చేసే అర్థరహితమైన పనుల్లో ఇదొకటీ!

అలాగే ఆలోచిస్తూ - అయిదారొందలు ఖర్చవ డాన్ని గురించి - పడుకొన్నాను. దాఫునుండి గాజులుకదిలిన చప్పుడు, దవనంవాసనా, చిన్ననవ్వు వినిపించాయి. ఎవరో ఆడదయివుంటుందని అనుకొన్నాను. పెళ్ళికొచ్చివుంటుందనీ, ఏదో పనివుండి, మేడమీదకొచ్చిందనీ నన్ను నేను సరిపెట్టు కొన్నాను. కాని మనస్సు - వెధవది చూడండి! ఎక్కడో ఏదోజరుగుతుందని—నామట్టుకు నేను సరిపెట్టుకోలేను. ఒద్దను కుంటూనే లేచి వాకిట్లోకొచ్చాను. నా ప్రక్కగదికి తాళం వేసివెడుతూ ఓ అమ్మాయి కనిపించింది. ఆట్టే అందమయింది కాదు. ఏపుగా, ఆరోగ్యంగా ఎదిగిన మొక్కలావుంది. కానీ ఆ కళ్ళు, అద్భుతం! మగవాణ్ణి ఆచూపులతో ఆవిడ ఏమైనా చెయ్యగల దనుకొన్నాను...గదిలోకొచ్చిపడుకొన్నాను. ఏమీతోచలేదు. కాసేపు అటూఇటూ తిరిగాను. అయిదారు సిగరెట్లు కాల్చాను. పెట్టెలు ఆ మూలనుండి ఈమూలకు సర్దాను. మా లలితను తిట్టుకొన్నాను.ఇదంతా ఎందుకు చేశా వని నన్నడక్కండి. దేనికీ నేను కారణాలు చెప్పలేను.

ఇక ఆ గదిలో వుండలేక కిందికొచ్చాను. వధూవరుల చేత బంతులాట ఆడిస్తున్నారు. కొన్ని క్షణాలపాటు, నా గతానుభవం మనస్సులో మెదిలింది. సిగ్గుతో, ఇలానే తల

వంచుకొన్న ఆనాటి లలితకూ దీనికీ ఎంత భేదం! ఇంతలో ఇంత 'రాకాసి'లా ఎలామారిపోయింది! ఇందుకు కారణ మెవరు? వృథా! నేను జవాబులు కనుక్కోలేను. మాఆవిడ కన్నమ్మయు రాలై వాళ్ళవేపే చూస్తోంది. దానిగ్గూడా ఇదే సంఘటన జ్ఞప్తికొచ్చిందేమో మరి! నేను అందరినీ కలియచూచాను. ఓముఖం దగ్గరకొచ్చిన చూపులు ఆగిపోయాయి. ఆ ముఖం నే నిందాకచూచిన అమ్మాయిది. అమాయకంగా (అని నా అభిప్రాయం) దంపతులవేపు చూస్తోంది. నే నలా ఆపిల్లకేసి చూస్తున్నాను. ఇంతలో ఎవరో దూరమునుండి కేకేశారు. జనంలో మాయమైంది ఆ ముఖం.

## 3

సకలసుగుణాలు ఒకే మనిషిలో వుండవని నానమ్మకం. అలాగే అన్ని దుర్గుణాలూ వుండవనికూడా నేను అనుకొం టుంటాను. అయితే ఒకమనిషి దుర్మార్గుడనిగానీ, సన్మార్గు డనిగానీ మన మెలా నిర్ణయిస్తామంటే, ఆ మనిషిలోని ఎక్కువ గుణాలనుబట్టేనని నా ఉద్దేశ్యం. దీని బాగోగు లను గురించి నేను చర్చించను. మా లలితకు తన సౌందర్యం మీద అపారమైన నమ్మకముంది. ఆ సౌందర్యంతో తుల తూగేవాళ్ళు—దాదాపు లేరని దాని అభిప్రాయం. ఈ అభి ప్రాయంతో నేను ఏకీభవించలేను. అలా ఏకీభవించలేక, ఒకటిరెండుసార్లు ఆమాట అన్నాను గూడాను.

'యేం నా చక్కదనానికేం? కాలేజీలో చదువు కొనే రోజుల్లో ఎంతమంది మాయింటిచుట్టూ కాపలాలు కాసేవాళ్ళు' అంటుంది.

"అదేటే సౌందర్యానికి గీటురాయి?"

'కాదు. నీలాంటివాణ్ణి వెంటవెంట తిప్పుకొన్నాను. పెళ్ళిపెటాకులూ కాకముందే నీచేత కోకలు, జాకెట్లు కొనిపించాను. సినిమాలకు, హోటల్సుకు బొచ్చెడంత తగలేయించాను. నేను చేసుకోనంటే ఆత్మహత్య చేసుకుంటానన్నదాకా నిన్ను తెచ్చాను. యే అందమూ, ఆకర్షణా లేకపోతే ఇవన్నీ ఏలా చేశానంటారు?' అంటుంది లలిత.

యేతావాతా చెప్పొచ్చేదేమిటంటే, దానిచేత యేపని చేయించుకోవాలన్నా, దాని అందాన్ని రవంత పొగిడితే చాలు ఉబ్బిపోతుంది. ఈ బలహీనత నాకు తెలుసు. గనకనే, దానితో వేగుతున్నాను.

ఆవిడధోరణి చూస్తూంటే, ఈ రాత్రి నేను వంటరిగా పడుకోవలసి వచ్చేటట్లుంది. ఉదయమనంగా, ఆ పెళ్ళిజనంతో కలిసినమనిషి, ఇంతవరకూ నా అతీగతీ కనుక్కోలేదంటే, మరేమనుకోను? అందుకే సందుచూసుకొని దాన్ని పైకి రప్పించాను.

"యేమిటి?" అన్నది లలిత.

"అబ్బే, మరేమీ లేదు. ఓ పావుగంట నువ్విలా నుంచో" అన్నాను.

"ఎందుకూ?"

అప్పుడే ఆవిడ పెదవులు నవ్వుతున్నాయి. నా అస్త్రాన్ని విప్పాను.

'ఈపూట, ఈ కాఫీకలర్ చీరెలో అద్భుతంగావున్నావు లలితా! అందుకుతోడు, బ్లూ మొఖమల్ జాకెట్టుకూడా

తొడుకున్నా వేమో! మనసు డొక్కుపట్టింది. అహాఁ. మరోలా అనుకోకు. ఇలాంటి సౌందర్యరాశిని...'

'ఊఁ-పోదురూ!' అన్నది లలిత మెల్లగా నా చెంపల్ని తాకుతూ 'మీ రెప్పుడూ ఇంతే అఁటారు'

'పిచ్చిదానా! ఎప్పుడన్నా మల్లెను మల్లె అంటారు గానీ ఉల్లి అనరుగదా!'

మా ఆవిడ నామాటనుతప్పించి, 'రాత్రికి ఊరేగింపు బ్రహ్మాండంగా జరుగుతుంది. పొన్నుసామిని పిలిపించారు. అతను బాగా వాయిస్తాట్టగా! మీరు రారూ?' అన్నది.

'నువ్వుపోతావా?' అన్నాను.

'హవ్వ! మఁపోకపోతే బావుంటుందిటండీ!'

'నేనొక్కణ్ణే ఇక్కడ పడుకోలేను. ఊరేగింపుతోనూ రాలేను...'

ఫక్కున నవ్వింది లలిత.

ఒక్కరాత్రికి...హవ్వ! పిల్లలుపుడితే ఎలాగండీ!'

నేను మాట్లాడలేదు.

ఆస్థితికొచ్చేటప్పటికి, నాలో ఆవాంఛగూడా వుండదనీ అప్పటికే అంతా మామూలు అయిపోయి. ఈ దాంపత్య సుఖంలోవున్న థ్రిల్లింగ్ చచ్చిపోతుందనీ, నేను లలితతో అనలేదు. అరగంటసేపు బ్రతిమలాడించుకొన్న తరువాత, వీలుంటే ఓసారి వచ్చిపోతానన్నది.

నాకు తెలుసు. లలిత విధిగా వస్తుంది. నాకున్న వేదన లాంటిదే లలితకూ వుంటుంది. నే నామెకోసం కలవరపడుతున్నట్టే, ఆవిడగూడా నాకోసం కలవరపడుతుంటుంది.

పురుషులందరికీ సహజమైనట్టు—నేను ముందు తొందరపడ తాను. ఆడదిగనుక లలిత చప్పున బైటపడదు.

# 4

చాలా ప్రొద్దుపోయింది. గదిలో పచార్లు చేస్తున్నాను. ఊరేగింపు క్రమంగా దూరం సాగిపోయింది. ఒక రిద్దరు మినహా, అందరూ ఊరేగింపువెంట వెళ్ళారు గావున క్రింది నుండి ఆట్టే చప్పుడు వినిపించటంలేదు. లలిత చెప్పినప్రకారం దీపం ఆర్పివేశాను. ఒకతలుపు కొద్దిగా తీసిఉంచాను. అంత క్రితమే, ఒకటికి రెండుసార్లు పక్కదులిపి శుభ్రంచేశాను. లలిత నా దగ్గిర ఉండటానికి ఆట్టే అవకాశంలేదుట. ఎవరన్నా చూస్తే బాగుండదట. 'ఒకటికి పదిసార్లు ప్రాధేయపడు తున్నారు. గనక పోనీలే అనుకొన్నా' అన్నది. మధ్యాహ్నం నాకు లలిత చెప్పినవిషయాలు నిజమే ననిపించింది.

క్షణాలు దీర్ఘంగా గడుస్తున్నాయి. ప్రతి చిన్నశబ్దా నికీ లలితేమోనని, తహతహలాడిపోతున్నాను. ఆవిడ యిచ్చిన సూచనలప్రకారం నేను ఆరుబైట తిరగగూడదు. అలాతిరిగితే తను రావటానికి వీలుండదట. ఏ వంక చెప్పి వచ్చినా ఇందుకోసమేనంటారుట. అందుకని, నే నసలు గదిలోలేనట్లే నటించాలి. లలిత ఏదో మరిచిపోయి, ఊరే గింపునుండి వెనక్కువస్తుంది. అంతే! తిరిగి పదినిమిషాల్లో వెళ్ళిపోతుంది. నేను ఉపాయంగూడా చెప్పాను.

'నీకుతలనొప్పి పుట్టుకొస్తుంది. పగలల్లా తిరిగావామె. అందుకని తలనొప్పొస్తుంది. ఊరేగింపు వెంట వెళ్ళలేవు. హాయిగా...ఉండొచ్చుగదూ ?' అన్నాను.

'ఆలోచిస్తాను' అన్నది లలిత.

అదృష్టవశాత్తూ లలిత ఇందుకే ఒప్పుకుంటేనా ?

మెట్లమీద చప్పుడైంది. నేను తలుపులోంచి బైటకు చూశాను. మంచిగంధంవాసన వచ్చింది. చప్పుడు క్రమ క్రమంగా దగ్గరవసాగింది. నేను చప్పున ప్రక్కకు తప్పుకొన్నాను. చప్పుడు నా తలుపుదగ్గరకొచ్చి క్షణకాల మాగింది. తరువాత తలుపు తెరుచుకొని లలిత నా గదిలోకొచ్చింది...

## 5

నా ప్రక్కగదిలో ఓ పాడుగొంతు గలగలమని నవ్వింది. ఆ నవ్వుకు నేనే లేచాను. అప్పటికి చాలా ప్రొద్దెక్కింది. బద్ధకంగా ఒళ్ళువిరుచుకొని సిగరెట్టు అంటించాను. ఆ గొంతుక మళ్ళా నవ్వింది. నేను ఉలిక్కిపడి సిగరెట్టు క్రిందికి జారవిడిచాను.

'అదిగాదే, మా ఆడవాళ్ళు ఇంతజ్ఞాపకశక్తిలేని వాళ్ళేం!' అన్న దా పాడుగొంతుక.

'ఏమిం ? ఈ రెండోగొంతు ! నేనుచూచిన అమ్మాయిదని గుర్తుపట్టాను.

'రాత్రి అసలు రానే రానంటివే, వచ్చావేం ?'

'మీ రేమయినా అనుకొనిపోతా రేమోనని వచ్చాను.' అన్న దా పిల్ల.

'పోనీ వచ్చినదానివి—'

'తెల్లార్లూ ఉండిపోడానికి ఇది మన సొంతయిల్లుటండీ! అప్పటికే మీ అక్కయ్య పసికట్టింది. ఆ అరగంటకీ—నన్నిప్పటిదాకా వేళాకోళం చేస్తూనే ఉంది,' అన్న దా పిల్ల.

'అరగంటేమిటేవ్ ఇప్పటిదాకా ఉండి' పొడుగొంతు పగలబడి నవ్వింది.

'ఏమో బాబూ! మీ ఎత్తిపొడుపులు నేను భరాయించలేను.

తరువాత తొందరగా వేసిన అడుగుల చప్పుడు. నేను సిగరెట్టు పారేసి లేచాను. మాఆవిడ కాఫీ తీసుకొచ్చింది.

'నేను వద్దుమొర్రో అంటే మీరు వినరు. నేను తలనొప్పని వచ్చినా మా వదిన నమ్మలేదు. 'మా అన్నయ్యను వదల్లేకపోయావ్' అంటూ ఒకటే గోల. వెంటనే పోతాను బాబూ! అంటే మీరు తెల్లార్లూ వదలరాయె! వాళ్ళ ముఖం చూడాలంటే నాకు చచ్చినచావుగా ..'అన్నది లలిత ధుమధుమలాడుతూ.

మెదడులో మేకుదించినట్టు అయిపోయ్యాను.

'అదేమిటేవ్! అప్పుడే వెడితివిగా'!

'ఆఁ వెళ్ళా. తెల్లారుజామున నాలుగ్గంటలకు' అని రుసరుసలాడింది లలిత. 'మాఏడుపులు మాకుంటాయి ...

ఏమోలెండి. ముందు ముఖం కడుక్కోండి. కాఫీ చల్లారి పోతుంది,' అని క్రింది కెళ్ళిపోయింది లలిత.

నే నేమయిపోయ్యానా? అడక్కండి.

ప్రకాశరావు ముగించి, ముఖంమీద చమట తుడుచుకొన్నాడు. క్లబ్బుస్నేహితులు నలుగురూ ఒకరి ముఖాలొకరు చూసుకొన్నారు.

'నువ్వా!నువ్వా!ఆ రాత్రి'తనలో తను అనుకొంటున్నట్లన్నాడు డాక్టరు ధనంజయరావు పాడుగొంతుకతో.

---